క్లుప్తంగా

అసిరిపోలమ్మకు చల్లదనం



చల్లదనోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం యిపుట్టుగ–లండపుట్టుగలో అసిరిపోలమ్మ తల్లి నవరాత్రి ఉత్సవాల మారుయాత్ర సందర్భంగా మంగళవారం భక్తులు చల్లదనోత్సవం నిర్వహించారు. పనస, మామిడి, అరటి పండ్లతో పాటు గజముద్దలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మేళతాళాలతో వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన ముత్యాలమ్మతల్లి ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

టెక్కలి: మండలంలోని పెద్దరోకళ్లపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సర్పంచ్ రాంపాత్రుని అనూషారెడ్డి నేతృత్వంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలకు గ్రామంలో యువకులంతా డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. మహిళలు ముర్రాటలతో అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పూర్వ విద్యార్థుల సాయం



బాధితురాలికి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అనకాపల్లి గ్రామానికి చెందిన ఎలుగు బాధితురాలు చిడిపల్లి సావిత్రికి పూర్వ విద్యార్థులు(1995–96 బ్యాచ్) మంగళవారం రూ.12 వేలు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. ఎలుగుబంటి దాడిలో సావిత్రి గాయపడటంతో పాటు ఆమె భర్త లోకనాథం మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్నేహితులు బాధితురాలను పరామర్శిస్తూ మనోధైర్యాన్ని నింపారు. సావిత్రి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

అధ్యాపకుడి ఔదార్యం



గున్న వెంకటరావు

కాశీబుగ్గ: మందస మండలం బహడాపల్లి గ్రామానికి చెందిన సానిల పున్నెమ్మ రెండు కిడ్నీలు పాడై తీవ్రమైన అనారోగ్యానికి గురైంది. డయాలసిస్ అవసరం కావడంతో పలాస కిడ్నీ ఆసుపత్రికి తీసుకువచ్చారు. సరిపడ రక్తం లేక ఇబ్బందిపడుతున్న సమయంలో మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు గున్న వెంకటరావు స్పందించారు. సరిపడా ఓ–పాజిటివ్ రక్తాన్ని అందించి ఆదుకున్నారు.

చిన్నారుల సంరక్షణపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి మాధురి

కాశీబుగ్గ: చిన్నారుల కదలికలు ఎప్పటికప్పుడు గమనిస్తూ వారి సంరక్షణపై దృష్టి పెట్టాలని పలాస కోర్టు న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. పలాస మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిల్డ్రన్స్ మిస్సింగ్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచితులతో పిల్లలు కలవకుండా జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఏఎస్ఐ గణపతిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.విశ్వేశ్వరరావు, న్యాయవాదులు బి.కామేశ్వరరావు పట్నాయక్, పిండి వెంకటరావు, కె.రజిని, బి.రవికుమార్, టి.శ్యామ్, పి.చిట్టిబాబు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

108 సిబ్బందికి శిక్షణ



శిక్షణ పొందిన ఈఎంటీలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో 108 అంబులెన్సు సిబ్బందికి మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులకు సీపీఆర్ చేయడం, వైద్య పరికరాలు, మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఈఎంఎస్ ఓఈ జగన్, ఓజేటీ నెయ్యిల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విరగకాసిన మునగ

- ఉద్దానం నుంచి ఉత్తరాదికి ఎగుమతులు
- పెద్ద ఎత్తున క్రయవిక్రయాలు



మునగకాయల కట్టలు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో మునగకాయలు విరగకాశాయి. ఎప్పుడూ లేనంతగా దిగుబడులు రావడంతో ఉత్తరాది రాష్ట్రాలకు సైతం పెద్ద ఎత్తున ఎగుమతులు జరుగుతున్నాయి. మెట్ట, పల్లపు ప్రాంతాల్లోనూ మునగకాయలు కాస్తున్నప్పటికీ రుచి, కమ్మదనం విషయంలో ఉద్దాన మునగ స్థాయే వేరు. అందుకే ఇక్కడి మునగకు ఉత్తరాది రాష్ట్రాల్లో గిరాకీ ఎక్కువ. ట్రిప్పుకు ఏకంగా రెండు టన్నుల మునగ కాయలు ఎగుమతి అవుతున్నాయంటే అతిశయోక్తి కాదు. కాశీబుగ్గ పాతజాతీయ రహదారి, ఇచ్ఛాపురం, హరిపురంలో ఎగుమతులు జరిగే పాయింట్లుఉన్నాయి. ఇక్కడికి వజ్రపుకొత్తూరు, మందస, పలాస, కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల నుంచి మునగకాయలు చేరుకుంటాయి. పూండి, వజ్రపుకొత్తూరు, కొర్రాయిగేటు, హరిపురం, మందస, బారువ, సోంపేట, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, బ్రాహ్మణతర్లా, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న లోకల్ మార్కెట్లలో సైతం మునగకాయల వ్యాపారం జోరుగా సాగుతోంది.

రూ.50 పలుకుతున్న దేశీ మునగ..

ఏటా మూడుసార్లు పంటకు వచ్చే మునగకాయలు(హైబ్రిడ్) రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. అయితే హైబ్రిడ్ కాయలు నిరంతరం కాస్తున్నా దేశీ మునగకే గిరాకీ ఎక్కువగా ఉంటోంది. కాయలు తుంచిన నాలుగైదు రోజుల వరకు వీటిని వినియోగించుకోవచ్చు. సరిపడా చల్లదనం అందిస్తే వారం రోజులు వరకు నిల్వ ఉంటాయి. వీటి సేకరణ ఒక్కపూటలో జరగ్గా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు రెండు రోజుల సమయం పడుతుంది. సీజన్ ప్రారంభంలో కిలో రూ.100 పలికిన మునగ కాయలు ప్రస్తుతం రూ.50కు చేరుకున్నాయి. పశ్చిమబెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలలో మునగకాయలను కూరలతో పాటు పచ్చడి, సాంబారు, వేపుళ్లు వంటి ఆహార పదార్థాల్లో వినియోగిస్తారు.



పసందైన పచ్చని మునగ



ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సిద్ధమవుతూ..

పోషక విలువలు అధికం..

ఉద్దాన వాతావరణం మునగకాయల పెరుగుదలకు ఉపకరిస్తోంది. హైబ్రిడ్ మునగతో పాటు దేశీ మునగకాయలు పోషక విలువలు అధికంగా ఉంటాయి. వ్యాధి నిరోధకశక్తిని పెంచడంతో పాటుజీర్ణ వ్యవస్థ ఉత్తేజమై మలబద్ధక సమస్య పరిష్కారమవుతుంది. ఈ ప్రాంతంలో వారానికి రెండు సార్లు మునగ ఆకులు, మునగ కాయల కూరలు తినడం పరిపాటి. మా తోటలలో మునగ చెట్లు ఏడాదికి మూడు సార్లు కాపు కాస్తున్నాయి.

– కుత్తుం వినోద్‌కుమార్, మునగ రైతు, మాకన్నపల్లి, పలాస మండలం

బడి పిల్లలకు రుచికరమైన భోజనాలు



శిక్షణకు హాజరైన మధ్యాహ్న భోజన నిర్వాహకులు



కంచిలి: వంట నిర్వాహకులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓలు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా బడి పిల్లలకు రుచికరమైన భోజనాలు వండిపెట్టాలని మండల విద్యా శాఖాధికారులు డి.తులసీరెడ్డి, డి.చిన్నారావు సూచించారు. టెక్కలి మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మంగళవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనాలు సిద్ధం చేయాలన్నారు. ఏయే ఆహార పదార్థాలు ఎలా తయారుచేయాలనే విషయాన్ని వీడియోల రూపంలో వివరించారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు వి.లక్ష్మి, బి.ఖగేశ్వరరావు, ఎస్.మల్లేశ్వరరావు, సిబ్బంది రవిబాబు, ధర్మారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని టెక్కలి డివిజన్ డిప్యూటీ విద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. కంచిలి మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఆవరణలో మంగళవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, డీఆర్‌పీ రాము, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ బి.వి.రమణ

వజ్రపుకొత్తూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. వజ్రపుకొత్తూరు వెలుగు కార్యాలయంలో ఎంఈఓ –2 బి.వి.రమణ అధ్యక్షతన జరిగిన శిక్షణ శిబిరంలో మాస్టర్ ట్రైనీ యు.లక్ష్మీ పథకం మెనూ, ప్రాధాన్యత, విపత్తుల సమయాల్లో నిర్వహించాల్సిన పాత్ర తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జి.జోగారావు రెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆహారం పంపిణీ

కాశీబుగ్గ: పలాస సత్యసాయి సమితి, పలాస–కాశీబుగ్గ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్షుద్బాధ నివారణ దినం సందర్భంగా మంగళవారం 72 మంది వృద్ధులు, నిరుపేద మహిళలకు ఆహారం పంపిణీ చేశారు. సత్యసాయి వాహనం ద్వారా పేదల ఇళ్ల వద్దకే క్యారేజీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రోణంకి హేమాచలం, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, లయన్ వీరఘట్టం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



భోజన క్యారేజీలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

శాంతిభద్రతల పరిరక్షణే కీలకం



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఓ సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని ఎన్నికల రిటరిన్గ్ అధికారి బి.సుదర్శన్‌దొర అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, సోంపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు టి.ఇమ్మాన్యుయల్‌రాజు, హెచ్.మల్లేశ్వరరావు, ఇచ్ఛాపురం రూరల్, టౌన్, కవిటి, కంచిలి, సోంపేట ఎస్ఐలు ఎస్.లక్ష్మణ్, సత్యనారాయణ, రాము, రాజేష్, బడ్డ హైమావతి పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోతనపల్లి కుసుమ

పలాస: మహత్తర శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటంలో అమరులైన వీరుల మార్గమే నేటి యువతరానికి మార్గదర్శకం కావాలని విప్లవ కమ్యూనిస్టు నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం రాత్రి వివిధ విప్లవ గ్రూపులకు చెందిన నాయకులు, ప్రజలు, ఆ పార్టీ అభిమానులు అమరుల స్మారక సభను ఘనంగా నిర్వహించారు. అనంతరం అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. సి.పి.ఐ.ఎం.ఎల్.న్యూడెమొక్రసీ నాయకురాలు పోతనపల్లి కుసుమ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, లిబరేషన్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, బవిరి కూర్మారావు, రాజు, అప్పయ్య, ఈశ్వరమ్మ, సుందరమ్మ, మునలయ్య, కైలాస్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



ఇచ్ఛాపురం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నాగరాణి



కవిటిబట్టివానిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థినులు



వజ్రపుకొత్తూరు: ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ పీఓ శార్వాణి, కిషోర బాలికలు

ఇచ్ఛాపురం: యుక్త వయస్సులో బాలికలు, మహిళలు రుతుక్రమంలో తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగరాణి అన్నారు. ఇచ్ఛాపురంలోని అంగన్‌వాడీ అర్బన్ ఐసీడీఎస్ కేంద్రాల్లో ప్రపంచ రుతుక్రమం పరిశుభ్రత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కవిటి: కౌమార దశలో రుతుచక్రం ప్రారంభమైన నాటి నుంచి యువతులు వ్యక్తిగత శరీర శుభ్రత తప్పక పాటించాలని కవిటి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.పల్లవి అన్నారు. కవిటి మండలం బట్టివానిపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ నాప్‌కిన్స్ వినియోగం వల్ల స్త్రీవ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి చైతన్యర్యాలీ నిర్వహించారు.

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని టెక్కలిపట్నం అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం కిశోరీ బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ దానమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కేఎస్ ఎ.ప్రవల్లిక, డి.ఊహ తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: టెక్కలిపట్నంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

వజ్రపుకొత్తూరు: కిషోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాశీబుగ్గ ఐసీడీఎస్ పీఓ డి.శార్వాణి అన్నారు. మంగళవారం బెండి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విటమిట్ –సి లభించే పండ్లు, కూరలు ఎక్కువగా తినాలన్నారు. నెలసరి సమయాల్లో సమతులాహారం తీసుకోవాలని సూచించారు. నీరు ఎక్కువగా తాగితే నెలసరి నొప్పులు తగ్గుతాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ గంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు , కిషోర బాలికలు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ధర్మపురంలో ర్యాలీ

ఇచ్ఛాపురం రూరల్: కిశోర బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి అన్నారు. ప్రపంచ రుతు పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా ధర్మపురం, ఎ.బలరాంపురం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ అశ్వినీ, ఏఎన్ఎం పున్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, రోజా, త్రివేణి, నల్ల భారతి, పైలా సరోజని, ఏదురు రఘుపతిని, నెయ్యిల శ్రీదేవి, గిన్ని సంతోష్‌కుమారి పాల్గొన్నారు.

వైభవంగా అసిరిపోలమ్మ సంబరాలు



నెలవంకలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



ఆకట్టుకున్న విచిత్రవేషధారణ



వీధి నాటకాల ప్రదర్శన

కవిటి: మండలంలోని నెలవంక గ్రామదేవత అసిరిపోలమ్మ అమ్మవారి సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన రథాలు, వీధినాటకాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. వీటిని చూసేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు.

1న హనుమాన్ మాలధారణలు ప్రారంభం



కాశీబుగ్గ : హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా జూన్ 1న రైల్వేకాలనీలో హనుమాన్ మాలధారణలు జరగనున్నాయని కౌన్సిలర్ గుజ్జు జోగారావు, గుజ్జు బాబూరావు మంగళవారం తెలిపారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పండ్లు, పూలతో అలంకరణ జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడులు

కవిటి : ఖరీఫ్ వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు ప్రధాన దమ్ము చేసేందుకు ముందు పచ్చిరొట్ట విత్తనాల సాగు చేసుకోవడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం కవిటి సచివాలయం పరిధిలో ఖరీఫ్ వరిసాగు చేస్తున్న అన్నదాతలకు రాయితీపై కట్టెజనుము, జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కవిటి పంచాయతీ విస్తరణాధికారి జి.వి.స్వామి, వ్యవసాయ సహాయకురాలు మాదిన సమన్వయ మాట్లాడుతూ రైతులు ముందుగా ఆర్డర్ చేసుకున్న మేరకు విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అన్నపూర్ణమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

కాశీబుగ్గ: మందస పట్టణంలోని అన్నపూర్ణమ్మతల్లి ఆలయం 14వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా దేవరవీధి నుంచి అన్నపూర్ణమ్మ గ్రామదేవతను ముత్తయిదువులు ముర్రాటలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చల్లదనం చేశారు. ఆలయం అభివృద్ధికి సహకరిస్తున్న పలువురిని నిర్వాహకులు సన్మానించారు.

వాసుదేవుడికి అభిషేకం



వాసుదేవుడి నిజరూప దర్శనం

కాశీబుగ్గ : కోరిన కోర్కెలు తీర్చే వాసుదేవ పెరుమాళ్ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం సందర్భంగా మాస తిరునక్షత్ర అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోపీనంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు సచ్చిదానందపాడి, అనిల్ పాడీలు వాసుదేవుడిని నిజరూపధారుని గావించి అభిషేకం చేశారు. అనంతరం దివ్యాలంకృతుని చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కేంద్రం నిర్ణయంతో మీటర్ రీడర్ల భవిష్యత్ ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న చాపర వేణుగోపాలరావు

కాశీబుగ్గ: కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చర్యల్లో భాగంగా స్మార్ట్ మీటర్లు రావడంతో మీటర్ రీడర్ల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఏఐటీయూసీ పలాస డివిజన్ సంఘం అధ్యక్షుడు చాపర వేణుగోపాల్ అన్నారు. కాశీబుగ్గ ఏఐటీయూసీ భవనం ఆవరణలో మంగళవారం మీటర్ రీడర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయం కల్పించి తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్‌శాఖ యాజమాన్యం అంగీకరించిన మూడు అంశాలను అమలు చేయాలని కోరారు. పీస్ రేటును పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు క్రాంతి కుమార్, జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆర్.కుమార్‌స్వామి, పలాస డివిజన్ అధ్యక్షుడు బి.ఓంకార్‌రావు, పలాస డివిజన్ ప్రధాన కార్యదర్శి డి.భాస్కరరావు, ప్రతినిధులు జి.ఆనందరావు, కె.నరేష్, ఎస్.బలరాం, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో

నేల సారవంతం

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని వెలుగు ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. మంగళవారం మశాఖపురం, పాయితారి గ్రామాల్లో నవ ధాన్యాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా నేల సారవంతమవుతుందన్నారు. మనతో పాటు సకల జీవరాశులు మనుగడ సాగించేందుకు ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీ కె.కుమారీ, సీసీలు మోహన్, సీఎఫ్ మోహని, రైతులు పాల్గొన్నారు.



నవధాన్యాలతో రైతులు